రేడియోలో టైమ్ చెప్పేడు “లోమా టైమ్” అంటూనూ.

సరిగ్గా ఆ టయిముకి తలకి అది రాసుకుంటే తెల్ల వెండ్రుకలు నల్లగా వున్నట్టవుపిస్తాయిట.

రోజూ మా ఆవిడ నన్ను నిద్దర్లేపే టైమది.

“లేవండీ - టయిమైందీ” అని వీలున్నంత గోముగా పలకరించే గుడ్మార్నింగ్ టైమది.

నేను మొహం కడుక్కోకపోయినా నా పక్క దెగ్గిరికి మా ఆవిడ కాఫీ తెచ్చిచ్చేసే టైమది.

నేను బద్ధకంగా అట్నించిటు ఒత్తిగిలితే.

ఊడిపోయినన్ని ఊడిపోగా.

నా నెత్తిమీద మిగిలిన వెండ్రుకల్ని.


మా ఆవిడ ఒక్కసారి అట్నించిటు కలియబెట్టి “అబ్బె రోజు రోజుకీ చిన్నపిల్లడయిపోతున్నారు. లేస్తారా. కాఫీ పట్టుకు పొమ్మంటారా?” అనేసే టైమది.

కాఫీ వెనక్కి పట్టుకుపోతే మళ్ళీ ఎప్పుడొస్తుంది?

అబ్బో, చెప్పలేం.

# పనికిరానికథ

## భమిడిపాటి రామగోపాలం



మొహం కిడగాలి గెడ్డం గియ్యాలి - మేడదిగి లావెటరీకి వెళ్ళాలి - అట్నుం చొచ్చి స్నానం చెయ్యాలి.

అప్పు డొస్తుందా కాఫీ.

కసిక.

తెచ్చిన కాఫీ వెనక్కి పట్టిగెళ్ళనియ్యా కూడదు.

ఎంచేతంటే వాడెవడో సామెత చేసేడు కూడాను.

బిట్వీన్ ది కప్ ఎండ్ ది లిప్ దేర్‌మేబి మెనీ ఎ స్లిప్ అని.

కాఫీ తాగుతున్నాను.

తాను కలియబెట్టేసిన నా జుట్టు వేపు చూస్తోంది మా ఆవిడ. తన మనస్సులో ఏం ఆలోచనలు కలియబెట్టుకున్నాదో మరి తెలియదుగాని-

"ఏమండీ" అని ప్రశ్నార్థకంగా పలకరించింది.

"చెప్పూ!" అన్నట్టు కప్పు అంచుమీంచి చూసేను.

"జుట్టుకి రంగేయించుకోరాదుటండీ?"

"ఎందుకూ?"

ఎందుకేమిటి? పండిపోతున్నాది రోజుకి గుప్పెడేసి చొప్పున!"

"పండితే పండనీ లేవే!"

"అలాక్కాదు. నేనెందుకు చెప్తున్నానో కొంచెం ఆలోచించుకోండి."

"...మా గొడవా?" అంటే కప్పుచేతిలో పెట్టే ...పారిపోయింది.

హాల్లో నిలువుటద్దం 'హల్లో' అంటూ పలకరించింది.

"'హౌవార్యూ, ఓల్డ్ బోయ్' అన్నట్టయింది.

గబగబా దువ్వెనతో జుట్టుని మామూలుగా చేసేను.

దువ్వేసుకుంటే కొంచెం నల్లగా కనిపిస్తుంది అక్కడక్కడ.

ఫరవాలేదోయ్ అనిపిస్తోంది.

జుట్టుకి రంగేసుకోవాలేమో అన్నభయం తగ్గిపోతుంది.

"టైమెంతయిందే?" అని కేకేశాను.

"ఇప్పుడే కదండీ రేడియోలో చెప్పేడూ అంటూ వచ్చింది మా ఆవిడ.

"ఏమిటి చెప్పేడు?"

తలకి అదేదో నూనె రాసుకునే టైమెం దట. అని తన ఐడియాని మరోమారు బల పర్చుకునే ధోరణిలో చెప్పింది.

నేను ఖాతరు చెయ్యలేదు.

ఎనిమిదై పోయిందన్నమాట. అరగంటలో బయల్దేరితేగాని బండందదు... టిఫిన్ తయారైందా?" అన్నాను.

"ఆ."

బెజవాడా, హైదరాబాదూ వెళ్ళాలి!

ఎనిమిదీ యాభయ్యయిదుకి రైలు.

రాజమండ్రి చేరేసరికి రెండవుతుంది.

మా బావమరిది రాజమండ్రి రైల్వే స్టేషన్లో గుమాస్తా. బండికి వొచ్చి కలవమని మూడ్రోజులనాడే ఉత్తరం రాసేను. ఒస్తాడు.

తెరిచుంచిన పుస్తకాలు, న్యూస్‌పేపర్లు అన్నీ సద్దుకున్నాను.

కార్నర్ సీట్లో పరుచుకున్న దుప్పటీ, బాగా నలిగిపోతే అదోమాటు తీసి దులిపి సరిగా వేసేను.

స్టేషన్లో బండాగుతోంది. మా బావమరిది ప్లాట్‌ఫారంమీద నుంచుని నా కోసం బండంతా వెతుక్కుంటాడు.

నేనే లేచి కంపార్టుమెంటు గుమ్మం దగ్గిర నిలబడితే—

పని సులువై పోతుంది—

అనుకుంటూ లేస్తున్నాను.

బండి ఆగింది.

"తాతగారూ, దిగిపోతున్నారా?"

వెళ్ళిపోతున్నాను గుమ్మం దగ్గరికి

"మిమ్మల్నే-"

అటు తిరిగి చూసేను.

నన్నే—

నా ఎదుటి కార్నర్ సీట్లో

నలభయ్యేళ్లావిడ కూచుందిగా. నలుగురు గడుగ్గాయి పిల్లల్తో!

ఆవిడ —

నావేపే చూస్తోంది,

తాతగారూ అని పిల్చింది-

నన్నేనా అని అనుమానంగా అటూ ఇటూ చూసేను.

నన్నే -

ఇంకెవరూ లేరక్కడ.

"దిగిపోవడం లేదండీ-" అన్నాను.

"మరేమీ అనుకోకపోతే తాతగారూ-ఈ మరచెంబుతో నీళ్లు తెచ్చిపెట్రూ? పిల్లలు దాహానికి గోల్చేస్తున్నారు!"

అంటూ చెంబు అందించింది.

ఒక్కసారిగా నిర్ఘాంతపోయాను.

వెంటనే సద్దుకున్నాను కూడాను.

"అయ్యో దానికేం భాగ్యం, ఇలా ఇవ్వండి!" అన్నాను.

చెంబందుకున్నాను.

ఆ క్షణంలో నా కావిడమీద వాత్సల్యం లాంటిది కలిగితే బాగుణ్ణనిపించింది.

"నీళ్ళేనా తల్లీ! నా భాగ్యం!ఈ వృద్ధుడు నీకామాత్రం సాయానికి అందగా వుండగలడమ్మా! నువ్వు నిశ్చింతగా వుండు తల్లీ" అని ఆమెను పొదివి పట్టుకుని వీపు నిమిరి చెప్పగలిగితే బావుణ్ణు-

కాని అలా ఎలా జరుగుతుంది!

నాకు ముప్పయ్యయిదో యేడు నడుస్తోంది.

తల పండిపోతోంది.

అది చూసి నాకు నలభై అయిదేళ్ళు దాటేయనుకోవచ్చు.

కాని నలభై ఏళ్ళావిడ తాతగారూ అని పిలవ్వలసినంత వార్ధక్యం కనబడదు.

పండుతున్నది తలవొక్కటే

చర్మంమీది నున్నతనం, అవయవాల్లోని దారుఢ్యం, కంఠస్వరంలోని స్పష్టతా-

ఇవేవీ గమనించకుండా వున్నదా ఆవిడ?

పోనీ నావేషం చూడరాదా?

డార్క్ కలర్ పెనామా పేంటు తొడుక్కున్నాను.

దానిమీద.

నూటికి యాభై పాళ్ళు బనీను కనిపించేటట్టుగా.

నూటికి నూరుపాళ్ళు టెర్లిన్ చొక్కా తొడుక్కున్నాను.

అప్టు డేటు మోడల్ నల్ల డయల్ రిస్టువాచీ ధరించాను కుడి ముంజేతికి.

అదీ చూళ్ళేదా?

నే చదివే పుస్తకాలుకూడా

భగవద్గీతలూకాదు, బ్రహ్మ సూత్రాలూ కావు-

ఉపనిషత్తులుకావు ఉపన్యాస వేదాంతాలు కావు

మామూలుగా యువతీ యువకులు చదువుకునే రంగురంగుల పత్రికలే.

పోనీ నాకు లాంగ్‌సైటువల్ల సంక్రమించవలసిన చత్వారపు కళ్ళజోడైనా యింకా రాలేదు.

ఇన్నిటిద్వారా నేను తాతగార్ని కానని స్పష్టంగా కనబడుతూ వుంటే కేవలం జుట్టు చూసి.

అదేదో ఆత్మ సౌందర్యం గమనించినదాన్లాగ నన్ను తాతగారూ అని పిల్చిందంటే తనకి నామీద వున్న గౌరవాన్ని తెలియజెయ్యడం లక్ష్యంగా పెట్టుకుం దనుకోడమా?

లేక మరచెంబు పోకుండా జాగ్రత్త పడుతున్న దనుకోడమా?

* * *

బెజవాడలో.

పుస్తకాల పబ్లిషర్ శాస్త్రిగారు స్టేషను కొచ్చేరు.

సాదరంగా స్వాగతమిస్తూ నన్ను స్టేషన్నుంచి టౌన్లోకి రవాణాచేసేరు.

నేను ఆఫీసు పనిమీద వొచ్చేనని సాయంత్రం షాపుకొచ్చికలుస్తాననీ చెప్పేను వాళ్ళ పుస్తకాల షాపుకి వెనకవేపుండే గదిలో నా కన్నిటికీ వసతిగా ఉంటుందనీ అక్కడే వుండమని అన్నాడు.

"ఎందుకు లేద్దురూ మీకు లేనిపోని శ్రమ. మా వొదినగారింట్లో వుంటాను" అన్నాను.

"అదేం కుదర్దు సార్. రాక రాకొస్తారు. ఏవో కథలూ కాకరకాయలూ మనం మాట్లాడుకోవలసినవి చాలా వుంటాయి. మీరు మా షాపు వెనకాల గదిలో వుండాల్సిందే; భోజనానికో చుట్టపు చూపుకో కావాలంటే మీ వదినెగారింటికి వెళ్ళొచ్చు లెండి"

* * *

మర్నాడు పగలంతా ఆఫీసు పని చూసుకొని పెందరాళేమాఒదినెగారింట్లో భోజనం చేసేసి రాత్రి ఎనిమిది గంట లవుతుండగా శాస్త్రిగారి పుస్తకాల షాపుకి చేరేను.

"ఈయన నీలకంఠంగారు. అమలాపురం" అని ఒకాయన్ని పరిచయం చేసేరు శాస్త్రిగారు. "ఈయనే రామగోపాలంగారు" అని నన్నాయనకి చూపించేరు.

కొత్తాయనవేపు చూశాను "నమస్కారమండీ" అంటూ.

అరవై ఏళ్ళుంటాయాయనకి

ఎమ్మెల్యే అంచు నేతపంచె కట్టాడు.

కోరాఖద్దరు కమీజు తొడుక్కున్నాడు.

బ్లీచ్ చేసిన ఖద్దరు కండువా చొక్కాపైన జీరాడుతోంది.

"నీలకంఠంగారికి అన్నిరకాలసాహిత్యం ఇష్టమేను. ఇటు కథకులూ, నవలాకార్లూ. అటు పద్యాలవారు, గేయాలవారు. అందరూ వారికి మిత్రులే-నాటక రచనమీద స్టేజి నటనమీద అభిరుచి. స్వయాన నటులు కూడాను" అన్నాడు శాస్త్రిగారు.

"చాలా సంతోషమండీ మిమ్మల్నికలుసుకున్నందుకు!" అన్నాను.

"ఇంతసేపూ మీ గురించే మాట్లాడుకున్నాం" అన్నాడాయన.

"నా గురించి మాట్లాడుకోడానికి ఏముంటుందిలెండి-సాహిత్యానికి నేను చేసినదెంత గనక," అన్నాను.

నిక్కమైన మంచి నీల మొక్కటిచాలు. తళుకు బెళుకురాలు తట్టెడేల" అన్నాడు నీలకంఠంగారు; కాంతివంతంగా చిరునవ్వు నవ్వుతూ. "అసలేమీ అక్కర్లేదు; మీరు రాసిన "వాత్సల్యానికి వారధి" అన్న నవల చాలదుటండీ? అన్నాడు. మళ్ళీ నాలుగు సెకండ్లాగి "పైగా మీది విజయనగరంట కదా; ఆ ఊర్నిండా మాకు బంధువులే. ఆ విధంగా మాకాప్తులుకూడాను" న్నాడు.

కాస్సేపు అదీ ఇదీ మాట్లాడుకున్నాం.

ఓ ముప్ఫయేళ్ళ సాహిత్యం మా మధ్య తెరలు తెరలుగా దొర్లిపోయింది. నేను చిన్నప్పుడు చదివిన పాత పుస్తకాలు, మా నాన్నగారు మా ఇంట్లో జాగర్తపెట్టిన నలభయ్యేళ్ళనాటి సాహిత్య మాస పత్రికలు నాకెంతో సాయం చేసేయి నీలకంఠంగారితో సమానంగా సాహిత్య చర్చ చేసేటందుకు.

"తమది విజయనగరం" అన్నారుకదూ అన్నాడాయన వుండండి.

"అవునండి."

"అక్కడే చదువుకున్నాను."

"మరేనండి."

తమకి సంగీతంలో తగుమాత్రం ప్రవేశం వుందనికూడా శాస్త్రి చెప్పాడు."

"ఆఁ ఏదోలెండి-"అయినా విజయనగరంలో ఓ పదేళ్ళుంటే సంగీతం - వంట అదే పంటబట్టేస్తుంది లెద్దురూ'' అన్నాడు తప్పంతా విజయనగరందే అయినట్టు.

"ఇచ్చ వుండాలికదా,''

"తమకి ఆదిభట్ల నారాయణదాసుగారు బాగా తెలుసనుకుంటాను" అన్నాడాయన.

"లేదండీ- నేను ఐదో క్లాసులో, వున్నప్పుడే ఆయన పోయారు."

"పోనీ వీక్షారమణయ్యగారు?''

"అప్పే ఆయనింకాపూర్వమే పోయాడు కదండీ."

''ఏవో అలా అంటారుగానీ మీకు వారు తెలీకపోవడమేమిటీ?'' అని కళ్లు నన్నగా చేసి నవ్వాడాయన. "గొప్పవారితో పరిచయం సాంగత్యం వుండీకూడా లేదంటున్నారంటే అది కేవలం విద్యయొసగిన మీ వినయాన్ని సూచిస్తుందంతే అన్నాడాయన.

అప్పుడు తెలిసింది.గొయ్యి తవ్వుతున్నాడ్రా బాబూ అని.

నయం!

నేను ప్రగల్భానికిపోయి శ్రుతి పాండిత్యాన్ని ఆధారంగా చేసుకుని-

"నారాయణదాసుగారు తెలీకపోడమేం టండీ! హరికథాపితామహులుకదా ఆయన? ఆయన గజ్జెకట్టి బల్లమీద కదన్తొక్కేడంటే అని అలాటిదేదైనా అనుంటే- నన్ను తిన్నగా తీసుకెళ్ళి ఆదిదం సూరకవితో నో ఆనంద గజపతి మహారాజులుంగారితో నో సమకాలికుణ్ణిగా చేసి పారేసి నా పుట్టుక 1885కి లాగేసేవాడే.

ఇహ కలగజేసుకోక తప్పదు!

"అయ్యా, మీరేమనుకుంటున్నారో ఏమోకాని నేను మాత్రం మీరనుకుంటున్నంత వయోవృద్ధుణ్ని మాత్రంకాదు.నేను ట్టింది 1932లో" అన్నాను.

"హ్హహ్హ హ్హ హ్హ హ్హ! పంధొమ్మిది వందల- ఎంతన్నారూ. ముప్ఫయి రెండా! ఇంకా నయం నలభై రెండన్నారుగాదు ! భలే హాస్యంగా మాట్లాడతారే మీరు !! అని ఆయన నేనేదో మాట్లాడబోతూ వుంటే కూడా చెయ్యడ్డం పెట్టేశాడు

* * *

మర్నాడు బెజవాడలో పని పూర్తవుతుంది, అయ్యాక హైద్రాబాదు వెళ్ళాలి. బస్సులో వెళ్ళడానికి టిక్కెట్టు రిజర్వుచేసుకున్నాను. ఒంటిగంటన్నరకి బస్సు!

పదకొండున్నరకి ఆఫీసు పని పూర్తయింది. మా తోడల్లుడుగార్ని వెంటబెట్టుకుని హడావిడిగా వాళ్ళింటికి చేరాను.

మా వొదినగారు లోపలి గదిలో ఎవరో వొక భద్ర మహిళను పీటవేసి కూర్చోపెట్టి ఆవిడతో బాతాఖానీ కొడుతోంది

"పొరుగింటావిడ పుస్తకాల పిచ్చి ఇంతా అంతా కాదీవిడకి" అని మా తోడల్లుడుగారు నా చెవి కొరికారు.

నాకావిడ మీద అభిమానం ముంచుకొచ్చింది. కొంపదీసి నా పాఠకురాలో ఏమో!

నేం లోపలికెళ్ళేలోగా మా వొదినగారు కూడా ఆవిడ చెవి కొరికి నట్టున్నాది. నేను తన మరిదినని- చిరునవ్వు నవ్వుకుంటూ లేచి నిలబడ్డాదావిడ.

"మీ మరిదిగారంటే మీ సత్యభామనిచ్చేరా?" అన్నాదావిడ చిన్న గొంతుకతో

"ఆఁ ఆయనే అన్నట్టు చెప్ప మరిచాను. ఈయన మా ఆయన పని చేసే డిపార్టుమెంట్లోనే ఆఫీసరు!" అంది మా వొదినగారు!

"అలాగాండి."

"అతరవాత - కథలు రాసే రామగోపాలం ఈయనే!"

"అయ్యబాబోయ్" అందావిడ మీరు రాసినవి చాలా చదివేనండోయ్"

"నేనేమీ రాయలేదండి –" అంటూ నేను సంభాషణకి ఉపక్రమించేను.

ఇంతలో మా తోడల్లుడుగారు కలుగజేసుకొని "అర్జంటుగా, ఆయనకి భోజనం పెట్టు, అవతల బస్సుకి టైమయిపోతోంది" అని మా వొదిన మొహంమీద నాలుగు చిటికెలు వేసేరు. లేకపోతే అప్పటికప్పుడు నాకో అభినందన సభ తయారై పోయేదేమో.

"వెళ్ళొస్తాను సుబ్బలక్ష్మిగారూ........ అది సరేకాని చిన్నమాట ఇలా వస్తారూ?" అంటూ ఆవిడ బైటికి దారితీసింది.

ఒక్క నిముషంలోనే కాళ్ళూ, చేతులూ, మొహం కడిగేసుకొని, భోజనానికి నా ఆలస్యం ఏమీ లేకుండా తయారై పోయేను. ఇంతలో మా వొదినగారు పళ్ళన్నీ కనబడేటట్టు నవ్వుకుంటూ వొచ్చిం దింట్లోకి.

"ఏంటా కులాసా?" అన్నాను.

"కులాసే మరీ! ఇటు సంపాదనా అటు కీర్తీ, అన్నిటికీ మించి గౌరవం ఇన్నీవున్న భాగ్యవంతుడి వయ్యావు. కులాసాకాదు మరీ?" అన్నాది మా వొదినగారు.

"ఆవిడెవరో బైటికిపిల్చి చెబితేనేగాని నీకు గుర్తురాలేదులా వుంది, నా భాగ్యవంతాను" అన్నాను.

"అంతే అంతే!" అని ఇంకా నవ్వుకుంటూ సంభాషణ మా తోడల్లుడుగారితో సాగించింది మా వొదినగారు.

"మా సత్యని మాణిక్యమ్మగారి తమ్ముడికి చేసుకుంటారేమోనని పెళ్ళిచూపులకి పిల్చుకొచ్చేం మీకు గుర్తుందా, తాడేపల్లిగూడెంలో!"

"అదేమో నాకు జ్ఞాపకంలేదు మీ అక్కచెల్లెళ్ళకి వొచ్చినన్ని సంబంధాలు భూప్రపంచకంమీద ఎవరికీ వచ్చుండవు. అవన్నీ ఎవడికి జ్ఞాపకం!" అనేశాడాయన.

"అప్పుడు మాణిక్యమ్మగారి తమ్ముడు నల్లగా వున్నాడని మా సత్య వొద్దంది. గుర్తులేదుటండీ?"

"అయితే అవును కాబోల్లెస్తూ ఇప్పుడదంతా యెందుకు? ఓ పక్క బస్సుకి టైమైపోతుంటే! ఆయనింకా పుస్తకాల షాపుకెళ్ళి పెట్టే బేడా సద్దుకోవాలి కూడాను. తొందరగా వొడ్డించమంటూ వుంటే!"

"అదికాదు" అంటూ వడ్డనకి ఏర్పాట్లు చేస్తూనే – "అందర్నీ కాదని ఈ ముసలాయనకిచ్చి చేసేరుటమ్మా పిల్లనీ, రెండో పెళ్ళా. మూడో పెళ్ళా అని అడుగుతోందండీ మాణిక్యమ్మగారు" అని మళ్ళా నవ్వింది మా వదినె.

"మతి పోయిందేమిటే? రెండో పెళ్ళవరికీ? ఆవిడంటే అన్నాది కానీ నువ్వు మళ్ళీ చెప్పడ మేమిటి; నోరు ముయ్యి!" అన్నాడు మా తోడల్లుడుగారు.

నిజమే మరి—

ఆయనకి నేను తోడల్లుణ్ణేకాక ఆఫీసర్ని కూడాను.

మా ఒదిన నాతో సరాగాలాడితే ఆడింది గాక! ఆయనెక్కడాడుతూ కూచోగలడు?

*    *    *

హైదరాబాదు చేరేను.

సత్యప్రసాద్ ఇంట్లో దిగుతానని అతనికి రాసేను.

బస్సు దిగి ఆటో చేసుకుని చిక్కడపల్లి వెళ్ళాను.

సత్యప్రసాద్ యిచ్చిన ఎడ్రస్‌నిబట్టి వీధి నెంబర్నిబట్టి ఆ ఇల్లు వెతుక్కున్నాను.

దొరికింది, అతను రాసిన ఆనవాలు—

మెయిన్ గేటుమీద చెక్కబోర్డు దానిమీద తెలుగక్షరాలతో వి. సాంబమూర్తి: ఎమ్. ఏ. ఎల్. టి—అన్న పేరు.

సాహసు దింపించాను.

"ఎవరి కోసమండీ?"

"ఈ ఇంట్లో సత్యప్రసాద్ వున్నాడు కదండీ!"

"ఉన్నాడున్నాడు స్టేట్ బ్యాంకిలో పని. ఆ కుర్రాడేనా?"

"ఆఁ ఆఁ అతనేనండీ-ఇక్కడేనా?"

"ఇక్కడే పెరటివేపు వాటా - అలా సందులోంచి వెళ్ళండి."

అతని తెలుగు మాట చూసి ఇతనెక్కడో సర్కారు జిల్లాలనుంచి వచ్చినవాడేనని రూఢి చేసుకున్నాను.

మొహం కాస్త తేరిపార చూడగానే మనిషి గుర్తొచ్చాడు.

"నమస్కారం. నన్ను గుర్తుపట్టలేదండీ?"

"అదే అదే. ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం—"

"అదేటి మేష్టారూ మీరు విజయనగరం కాలేజీలో లెక్చరర్‌గా పని చెయ్యలేదూ? నేను మీ దగ్గర బి. ఏ. చదువుకున్నాను–1951లో. నా పేరు రామగోపాలం సార్!"

"నువ్వుటయ్యా, నీ తస్సా చెక్క, ఎంత మారిపోయావు? నిన్ను చూసీ చూడగానే ఎక్కడో చూసిన మొహంలా వుందని అనుమానిస్తూనే వున్నాననుకో. కాని నా స్టూడెంటనుకోలేదు. అలహాబాదు యూనివర్సిటీలో నేను చదివినప్పుడు మా ప్రొఫెసరొకాయన సరిగ్గా యిలాగే వుండేవాడు. ఆయననుకున్నాను!" అన్నారు సాంబమూర్తిగారు షేక్‌హాండ్‌కోసం చెయ్యి జాపుతూ.

చేతిలో సంచీ మార్చుకోడానికి వీల్లేదన్నట్లుగా నేను ఆ చెయ్యందుకోలేదు.

పైగా ఆటోరిక్షా అబ్బాయి నా సూట్‌కేస్ పట్టుకుని సందులోకి దూరిసేడు. హడావుడిగా అతని వెనకపడ్డాను.

*    *    *

రెండ్రోజులైంది.

హైదరాబాద్‌లో నేననుకున్న పనులన్నీ అయిపోయాయి. సాయంకాలానికిగాని రేపు పొద్దుటికిగాని బెజవాడకి బస్సుటిక్కెట్టు కొనేసెయ్యమని సత్యప్రసాదుకి చెప్పేను.

వేగిరం విశాఖపట్నానికి వెళ్ళిపోవాలనున్నాది.

అంచేత సాయంకాలం బస్సుకే టికెట్ దొరికితే బావుణ్ణనిపిస్తున్నాది. ఇంతట్లోకే సత్యప్రసాద్ ఫోన్‌చేసి టిక్కెట్టు రేపటికేనని ఇవాళ ఉండిపోక తప్పదని చెప్పాడు, యువతీమండల్లో చెంబై వైద్యనాధ భాగవతార్ కచేరీ వుంది రమ్మన్నాడు.

నాలుగురోజుల్నించిఆఫీసుపన్లతో ప్రయాణాల్తో సతమతమయిపోతున్నాను. ఇవాళ అనుకోకుండా ఈ అదృష్టం!

మహానుభావుడు చెంబై. మనం కావాలనుకున్నప్పుడు దొరకడు. ఆమధ్య ఆయన విశాఖపట్నం వొచ్చినపుడు ఊపిరి సలపని పని, వెళ్ళలేకపోయాను.

ఇప్పుడు తలపని తలంపుగా ఈ అవకాశం.

గొప్ప ఆవేశం వొచ్చింది.

'సంగీతజ్ఞానము భక్తివినా సన్మార్గం కలదే మనసా' అనుకుంటూ గొప్ప సంగీతం వినడానికి మనస్సుని దేహాన్ని సిద్ధం చేస్తున్నాను.

నాలుగు రోజుల్నించే టెర్లిన్ వులెన్ సూట్లమధ్య ఉక్కిపోతున్నాను. దానికూడా రిలీఫ్ దొరికింది.

మొహం కడుక్కున్నాను తల దువ్వుకున్నాను. తలంటుపోసుకున్నానేమో, జుట్టు పట్టుకుచ్చులా గున్నది. గొప్ప సుఖంగా వుంది.

తిలకంసీసా తీసుకుని నిలువుగా పొడుగ్గా బొట్టెట్టుకున్నాను.

# ఆమె..

ఒక సాంధ్యవేళ గగనాన విరిసిన
పదునైన శక్రచాపం
కను ఎడదలోన స్పందించిపోవు
రతనాల రాగభావం
ఇరుదరులలోన ఘోషించి సాగు
సెలయేటి నీటి ప్రణవం
అరమోడ్పు కనుల వాసంత హేల
పరికించు విరుల పరువం.

— కొంపెల్ల రామకృష్ణమూర్తి

---

గ్లాసోక్క మల్లుపంచె తీశాను. ఉభయ పింజలూ పోసి కట్టాను.

కళ్ళీ లాల్చీ వేసుకున్నాను.

అకుచెప్పులు తొడుక్కునిబైటికొచ్చాను. బస్టాండ్‌దాకా వచ్చి కిళ్ళీ కొట్టుమీద డజను కప్పూర ఆకులూ, నాలుగు వక్క పొడి పొట్లాలూ ఇంత సున్నం ముద్దా కొనుక్కున్నాను. జేబులో ఉమాదేవిగారిచ్చిన ఏలక్కాయలూ, లవంగాలూ ఉన్నాయి.

బస్సుకోసం చూస్తూ తాంబూలం వేసుకుంటున్నాను చిన్నప్పుడు మద్రాసులో వున్నప్పుడు అలవాటు. సున్నం సున్నగా ఉన్నది ఆకులకి పట్టించి గరుగ్గా వున్నది ఎలక్ట్రిపోల్‌కి రాస్తున్నాను.

ఒకావిడ ఆ పోల్ని ఆనుకుని నిలబడ్డాది. ముచ్చటగా ముగ్గురు పిల్లలున్నారు. సున్నం రెబ్బ ఎర్రచీరకి ఎక్కడ తగుల్తుందోనని దూరంగా జరుగుతూ హైదరాబాదులో ఈ వెత్తనిపాక్‌గాడు ఎవడన్నట్టు తేరిపార చూసింది నా వైపు.

నేనూ చూశాను.

అనుమానం వేసింది-

ఎక్కడో చూశాను.

మరో పదిసెకండ్లుతిరిగేలోగా మరి రెండు పాళ్లు చూశాను.

నమ్మకం ఏర్పడుతోంది-

గాయత్రే!

ఇక్కడున్నాదా గాయత్రి!

అప్పుడే ముగ్గురు పిల్లలు కూడానా.

నా వేపు చూస్తున్నాది గాయత్రి.

నేనెవరో ఇంకా గుర్తు రాలేదులా వుంది.

గాయత్రిలో [illegible].

పాతజ్ఞాపక మేదియో—పలకరించెను గుండెలో అని రాసేడు కవి.

1949 నాటి మాట.

నేను ఇంటర్మీడియట్ సెకండియర్.

తను ఫస్ట్‌ఫారమ్.

మాకు ఫస్ట్‌ఫారమ్‌దాకా లెక్కలు చెప్పిన సుబ్బారావుగారమ్మాయి.

తనకి పదిహేనో ఏడు.

విజయనగరంలో—

అన్నాళ్ళూ ఎక్కడున్నా కానీ ఆ ఏడాది మా ఇంటి కెదురుగా వున్నింట్లోకి వచ్చేరు.

చెవిలో సొంతరాగం గుంయిమంటున్న ఉమ్మెదని నేను.

విడీవిడని మొగ్గ గాయత్రి.

చూపుల్తోనే సంపూర్ణాలింగనాలు చేసేసుకునేవాళ్ళం.

అంతకంటే ఏం చెయ్యాలో మాకు తెలీదు అప్పటికి మరి.

ఆ తర్వాత కొన్నాళ్ళకి వాళ్ళెల్లిపోయారు ఆ ఇంట్లోంచి, గాయత్రి నాకు అవుపళ్ళేదు మరి. కాని పెళ్ళిచూపులకెళ్ళి ఆ పిల్లల్ని పరీక్షగా చూసేటప్పుడు గాయత్రే జ్ఞాపకం వచ్చి ప్రతీ పిల్ల అలాగే కనబడేది. కాని ప్రతీ పిల్లకీ గాయత్రికున్నలాటి కళ్ళెక్కణ్ణుంచొస్తాయి.

పిల్లలు నచకపోయినప్పుడల్లా గాయత్రి జ్ఞాపకాని కొచ్చి ఆ మాట చెప్పడానికి మొహమాట పడిపోయేవాణ్ణి-

నాకిప్పుణ్ణుంచి పెళ్ళేమిటమ్మా అని తప్పేసేవాణ్ణి.

చివరికోసారి మా అమ్మతో అన్నాను- సుబ్బారావు మేష్టా రమ్మాయి గాయత్రి అయితే చేసుకుంటానమ్మా అని.

మా అమ్మ భోగట్టాలు చేసింది.

ఎక్కడున్నా దెక్కడున్నాదీ మా కాబోయే కోడలవా అంటూనూ.

ఎక్కడున్నాదో మరి తెలిసిందేకాదు.

చివరి కిక్కడ తేలింది.

“నమస్కారమండీ” అంది రెండు చేతులూ జోడించి.

నోట్నిండా ఆకులు - చెయ్యాడించేను.

“మీది విజయనగరం కాదండీ?”

ఇన్నాళ్ళయిపోయినా నేను పలకరించి మాట్లాడలేకపోయాను. లేదా తను పలకరిస్తేకూడా మాట్లాడ్డానికి వీల్లేకుండా ఈ ఆకులు నములడం వొకటీ.

తల నిలువుగా ఆడించేను.

ఉమ్మితుంపర్లు గాని పడిపోతా యేమో ననే భయంతో కొంచెం వెనక్కి తగ్గేను.

“మీ ఇంటి పేరు భమిడిపాటివారు కాదూ!”

కుడిచేతి చూపుడువేలుతో “కరెక్ట్” అని సంజ్ఞ చేసేను.

నేను గాయత్రినండి సుబ్బారావుగా రమ్మాయిని- మీ ఇంటెదురుగుండా వుండే వాళ్ళం కొన్నాళ్ళు- జ్ఞాపకం ఉన్నామా?”

ఓ మాటు ఉమ్మి “అయ్యో, ఎంత మాటా!” అన్నాను.

“మీ అబ్బాయి రామగోపాలం అని వొకడుండాలి. ఇప్పుడెక్కడున్నాడు?”

వెనకాతల ఏదో రాయి తగిల్నట్టు అయింది. అడుగు తడబడింది.

బర్రుమంటూ బస్సొచ్చింది.

“బర్కత్‌పురా చల్తీ?” అని అడుగుతూ వాడేం చెప్తున్నాడో వినిపించుకోకుండా బస్సులో దూరేసేను.

* * *

వాల్తేరు స్టేషన్లో రైలు దిగేసరికి పొద్దెక్కి వేడవుతోంది. రిక్షా మాటాడుకున్నాను. ఇంటికి చేరేసరికి ఎనిమిది దగ్గిరవుతోంది.

పనిమనిషి నేనూ వొకేసారి గుమ్మం దగ్గర తటస్థపడ్డాం.

“సరేగాని అలా సెలూన్‌కెళ్ళి అప్పారావు నోసారి రమ్మన్నానని చెప్పిరా” అని పనిమనిషికి పురమాయించేను.

పనిమనిషి వెళ్ళింది.

“అప్పారావెందుకూ?” అంటూ సత్యభామ ఎదురొచ్చిందింట్లోంచి.

జేబులోంచి రెండు సీసాలుగా వున్న దొక పాకెట్ తీశాను.

“ఏమిటిది?”

“జుట్టుకి రంగేసుకోమన్నావుగా”

“అన్నానుగానీ మీరు వేసుకుంటారని అనుకున్నాట్టండీ! ఇంతకీ ఏం జరిగింది?”

కథే జరిగింది

‘ఏమికథ?’

‘పనికిరాని కథ’

“పనికిరాక పోవడమేమీ?”

“నిజంగా జరిగిందేదైనా సరే కథగా పనికిరాదన్నాడు ఆస్కార్ వైల్డు!

“లోమా టైమ్” అని అరుస్తున్నాడు రేడియో సిలోన్లోంచి. ★